నమస్తే తెలంగాణ

# హనుమకొండ

5 | మంగళవారం 18 జూన్ 2024 | HANUMAKONDA



## డీన్ లేకుండానే పీహెచ్‌డీ వైవా పూర్తి

# పాలన అస్తవ్యస్తం

- కేయూలో సైన్స్ డీన్ నియామకంలో జాప్యం
- ప్రక్రియపై టీచింగ్ ఫ్యాకల్టీ అసంతృప్తి
- వెంటనే తేల్చాలని సీనియర్ ప్రొఫెసర్ల డిమాండ్

*కేయూలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. పాలన పడకేసింది. ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ నియామకంపై సాగదీత కొనసాగుతున్నది. డీన్ పోస్టు ఖాళీ అయి 17 రోజులైనా రిజిస్ట్రార్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడాన్ని సీనియర్ ప్రొఫెసర్లు తప్పబడుతున్నారు. పూర్తిస్థాయి డీన్ లేకుండానే పీహెచ్‌డీకి సంబంధించిన కీలక నిర్ణయాలు, ప్రక్రియలను పూర్తి చేయడం చెల్లదని చెబుతున్నారు. రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉద్దేశపూర్వకంగానే డీన్ నియామకంపై జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్‌ను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.*

*- వరంగల్, జూన్ 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

### నిష్పక్షపాతంగా భర్తీ చేయాలి

'ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్‌కు డీన్ పోస్టును ఆలస్యం చేయకుండా, పక్షపాత రహితంగా భర్తీ చేయాలి. గతంలో కొన్ని విభాగాల్లో హెడ్, ఇతర పదవులను అక్రమ పద్ధతిలో నియమించారు. సీనియర్ టీచర్లు ఎవరూ నష్టపోకుండా ఈ డీన్ పోస్టును భర్తీ చేయాలి. భర్తీపై ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్ వెంటనే దృష్టి సారించాలి'.

– మామిడాల ఇస్తారి, అకుట్ జనరల్ సెక్రటరీ

### డీన్ నియామకంలో కాంట్రవర్సీ ఉంది..

కాకతీయ యూనివర్సిటీ సైన్స్ డీన్ నియామకంలో కొంత కాంట్రవర్సీ ఉన్నది. అందుకే జాప్యం జరుగుతున్నది. ఒక్కో యూనివర్సిటీలో ఒక్కో రకమైన నిబంధనలు ఉన్నాయి. రిజిస్ట్రార్‌గా నాకు అందరూ సమానమే. డీన్ లేకుండా బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ద్వారా పీహెచ్‌డీ వైవా పూర్తి చేశాం. డీన్ల నియామకం గురించి ఇన్‌చార్జి వీసీ దృష్టికి తీసుకెళ్లాం.

– ప్రొఫెసర్ మల్లారెడ్డి, కేయూ రిజిస్ట్రార్

కాకతీయ యూనివర్సిటీలో పరిపాలన అస్తవ్యస్తంగా మారుతున్నది. కీలకమైన పోస్టుల నియామకంలోనూ ఉన్నతాధికారుల తీరుపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ నియామకంపై వివాదం తలెత్తింది. రెండు వారాలుగా ఈ పోస్టు ఖాళీగా ఉన్నా నియామకంపై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. డీన్ లేకుండానే పలు డిపార్ట్‌మెంట్లలో పీహెచ్‌డీ సెమినార్లు, వైవా పూర్తవుతున్నాయి. ఒకవేళ డీన్ సెలవుల్లో ఉంటే పరిపాలనా పరంగా ఇబ్బందులు రావొద్దనే ఉద్దేశంతో డిపార్ట్‌మెంట్ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ తాత్కాలికంగా డీన్‌గా వ్యవహరిస్తారు. ఈ నిబంధనను సాకుగా చూపి ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ నియామకం విషయంలో కేయూ ఉన్నతాధికారులు జాప్యం చేస్తున్నారు. పూర్తిస్థాయి డీన్ లేకుండానే పీహెచ్‌డీకి సంబంధించిన కీలక నిర్ణయాలు, ప్రక్రియలను పూర్తి చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఇలాంటివి చెల్లబోవని సీనియర్ ప్రొఫెసర్లు అంటున్నారు. కొత్త డీన్‌ను నియమించే వరకు సదరు డిపార్ట్‌మెంట్లలో సెమినార్లు వాయిదా వేసుకోవాలని సూచిస్తున్నారు. ఫిజిక్స్, జువాలజీ, బయో టెక్నాలజీ, ఇతర కొన్ని విభాగాల్లో డీన్ లేకుండానే సెమినార్లు, వైవా పూర్తయ్యాయి. పీహెచ్‌డీ విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు వెంటనే కొత్త డీన్‌ను నియమించాలని కోరుతున్నారు.

ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా ఉన్న మల్లారెడ్డి గతంలో ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్‌గా పని చేశారు. మే 31న మల్లారెడ్డి పదవీకాలం పూర్తయింది. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉంటున్నది. ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా వాకాటి కరుణ బాధ్యతలు చేపట్టి 25 రోజులు గడిచింది. ఇప్పటివరకు సైన్స్ ఫ్యాకల్టీ డీన్‌ను నియమించలేదు. డీన్ పోస్టు ఖాళీ అయి 17 రోజులవుతున్నా ఇప్పటి వరకు భర్తీపై నిర్ణయం తీసుకోకపోవడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉద్దేశ పూర్వకంగానే జాప్యం చేస్తున్నారని సీనియర్ ప్రొఫెసర్లు ఆరోపిస్తున్నారు. యూనివర్సిటీ సైన్స్ విభాగాల్లో పనిచేసే వారిలో సీనియర్ ప్రొఫెసర్‌కు డీన్ బాధ్యతలు ఇచ్చే పద్ధతి ఉన్నది. మల్లారెడ్డి తర్వాత సీనియర్‌గా ఉండే ప్రొఫెసర్‌కు ఈ పోస్టును కేటాయించే అవకాశం ఉంటుంది. సీనియారిటీ ఖరారుపైనే అనేక సందేహాలు నెలకొన్నాయి. యూనివర్సిటీలో మొదట అపాయింట్ అయిన తేదీ ఆధారంగా సీనియారిటీ ఖరారు చేయడమా? ప్రొఫెసర్‌గా ఎక్కువకాలం సర్వీసు చేసిన వారు సీనియర్ అవుతారా అనే దానిపై ఉన్నతాధికారులు తేల్చడంలేదు. గతంలో సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీ డీన్ నియామకంలో ఇలాంటి వివాదం తలెత్తినప్పుడు యూనివర్సిటీలో అపాయింట్ అయిన తేదీ ఆధారంగా సీనియారిటీని ఖరారు చేసి డీన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఫ్యాకల్టీ ఆఫ్ ఫార్మసీలోనూ యూనివర్సిటీలో అపాయింట్ అయిన తేదీ ప్రాతిపదికనే డీన్ పోస్టు భర్తీ చేశారు. ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ భర్తీలోనూ ఇదే పద్ధతిని పాటించారు.

పాత ప్రభుత్వ సర్వీసును కలుపుకుని, మిగిలిన వారి కంటే ముందుగానే ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందితే ఆ ప్రొఫెసర్ క్యాడర్ సీనియర్ కాదని, అది ప్రమోషన్ బెనిఫిట్స్ కోసమే ఉపయోగపడుతుందని వర్సిటీ సీనియర్ ప్రొఫెసర్లు చెబుతున్నారు. సీనియారిటీ నిబంధనల ప్రకారం చూస్తే మల్లారెడ్డి తర్వాత సీనియర్ అయిన ప్రొఫెసర్‌కు ఈ పోస్టు దక్కాలి. ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్ పోస్టు భర్తీ చేసేందుకు ఇన్‌చార్జి వీసీకి రిజిస్ట్రార్ పంపే ప్రతిపాదనలపై అందరి దృష్టి ఉన్నది.

## పీహెచ్‌డీ అడ్మిషన్లు అమ్ముకుంటున్నారని ఆందోళన

హనుమకొండ చౌరస్తా : కేయూలో అనర్హులకు పీహెచ్‌డీ అడ్మిషన్లను రూ. 2 లక్షలకు అమ్ముకుంటున్నారని విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. రిజిస్ట్రార్ మల్లారెడ్డి చాంబర్‌లో విద్యార్థులు బైఠాయించి నిరసన తెలిపారు. ఉన్నత విద్యామండలి నివేదికను కాదని రిజిస్ట్రార్ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే అర్హులకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న కేయూ ఎస్సై రాజ్‌కుమార్ అక్కడికి చేరుకొని సముదాయించే ప్రయత్నం చేశారు.



రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగుతున్న విద్యార్థులు



భూపాలపల్లిలో మధ్యాహ్నం వేళ ఎండలో గొడుగులతో యువతులు

## ▪ వరుణుడు కరుణించాలని..



సంగెం: కప్పతల్లి ఆడుతున్న గ్రామస్తులు

## ▪ జూన్‌లోనూ సెగ తగ్గక

*నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించినా ఆశించిన వానల్లేక ఇటు రైతులు, ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. పలుచోట్ల అడపాదడపా కొద్దిపాటి వర్షం కురుస్తుంటే మరికొన్ని చోట్ల ఎండవేడి హడలెత్తిస్తోంది. నిజానికి ఈ సమయంలో కురిసే భారీ వానలకు గొడుగుల అవసరం ఉంటుంది. ఇప్పుడు జూన్ 3వ వారంలోనూ ఎండ భయానికి జనం గొడుగులు, నెత్తిన తడకలతో వెళ్లిన దృశ్యాలు భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కనిపించా యి. అలాగే వరుణుడు కరుణించాలని సంగెం మండల కేంద్రంలో సోమవారం కప్పతల్లి ఆడి పోచమ్మకు గ్రామస్తులు పూజలు చేశారు.*

*- సంగెం/ఫొటోగ్రాఫర్ జయశంకర్ భూపాలపల్లి, జూన్ 17*



భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్‌లో తడుకలను తలపై పెట్టుకొని బైక్‌పై వెళ్తున్న యువకులు



భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

- భూపాలపల్లి జిల్లా అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా
- మద్దతు తెలిపిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

# ఇండ్ల పట్టాల కోసం రోడ్డెక్కిన లబ్ధిదారులు

కృష్ణకాలనీ, జూన్ 17 : జిల్లాకేంద్రంలోని భాస్కర్‌గడ్డలో కేసీఆర్ ప్రభుత్వం 2023 అక్టోబర్‌లో తమకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్లకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు సోమవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. 462 ఇండ్లకు 392 మందిని గుర్తించి కలెక్టర్ సమక్షంలో డ్రా పద్ధతిలో ఇండ్లను కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ రావడంతో ఇంటి పట్టాలు ఇవ్వలేదని, కోడ్ ముగియగానే ఇస్తామని కలెక్టర్ చెప్పారని తెలిపారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును కలిసినా ఫలితంలేదని వాపోయారు.

### కాంగ్రెస్‌ది కక్షసాధింపు చర్య

కాంగ్రెస్ ప్రభుత్వానిది కక్ష సాధింపు చర్య అని బీఆర్ఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. ఇండ్ల పట్టాల కోసం లబ్ధిదారులు చేస్తున్న ధర్నాకు ఆమె సంఘీభావం తెలిపారు. రెండు గంటలపాటు వారితో ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కొంతమంది అధికార పార్టీ నాయకులు అక్రమంగా ఇండ్లను తీసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ లబ్ధిదారులకు పట్టాలివ్వకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై లబ్ధిదారులు ఎమ్మెల్యే వద్దకు వెళ్లగా ఎంపిక చేసిన వారిలో అర్హులు లేరని, రీ సర్వే చేసి మళ్లీ కేటాయిస్తామంటూ ఆరు నెలలుగా తిప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సర్వే చేసి నాలుగు నెలలవుతున్నా ఇప్పటి వరకు ఎవరి ప్రయోజనం కోసం లబ్ధిదారులను ఎంపిక చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరు రోజులుగా పేదలు ధర్నాలు చేస్తుంటే ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో దొంగ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనను పక్కన పెట్టి కాళేశ్వరం ప్రాజెక్ట్, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల పంపిణీ, కరెంట్ సరఫరాలో అవకతవకలు జరిగాయంటూ కాలయాపన చేస్తున్నదన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తన తప్పును తెలుసుకొని లబ్ధిదారులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారని భూపాలపల్లి సీఐ నరేశ్ కుమార్ తెలుపగా, వారం రోజుల్లో పట్టాల్వికపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని గండ్ర జ్యోతి హెచ్చరించారు. ధర్నాలో పాల్గొన్న గండ్ర జ్యోతితో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజుపటేల్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, నాయకులు గడ్డం కుమార్‌రెడ్డి, కరీం, బీబీ చారి, బట్టు సంపత్, మేకల మల్లేశ్, శ్రీకాంత్ పటేల్, నాగుల దేవేందర్‌రెడ్డి, బుర్ర రాజు, కరాటే శ్రీనివాస్, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు, 200 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కాళ్లు పట్టుకుంట సారు.. పట్టా ఇప్పించండి

### భూపాలపల్లి సీఐ కాళ్లపై పడిన లబ్ధిదారు సమ్మక్క

'గతేడాది అక్టోబర్‌లో నాకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇంటికి పట్టా ఇవ్వమంటే కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఇవ్వడం లేదు సార్. నీ కాళ్లు పట్టుకుంట నా ఇంటికి పట్టా ఇప్పించండి' అంటూ లబ్ధిదారు తాటికొండ సమ్మక్క భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్ కాళ్ల మీద పడి తన గోడును వెళ్లబోసుకుంది. అంబేద్కర్ సెంటర్‌లో లబ్ధిదారులు ధర్నా చేస్తుండగా సీఐ తన సిబ్బందితో అక్కడకు చేరుకొని చెదరగొట్టేందుకు ప్రయత్నిస్తుండగా సమ్మక్క లేచి 'సార్.. నాకు 30 ఏండ్లుగా ఇళ్లు లేదు. కిరాయి ఇండ్లల్లో ఉంటున్న. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నా పేదరికాన్ని గుర్తించి డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించింది. నా ఇంటికి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టా ఇవ్వకుండా తీసేయాలని చూస్తున్నది. నాకు పట్టా ఇప్పించండి' అంటూ సీఐ కాళ్ల మీద పడింది. దీంతో అక్కడున్న లబ్ధిదారులు, అధికారులు కండ్లల్లోకి నీళ్లు తెచ్చుకున్నారు.



తమకు ఇండ్లకు పట్టాలిప్పించాలని భూపాలపల్లి సీఐకి మొక్కుతున్న తాటికొండ సమ్మక్క

# కాంబోడియాలో మనోడి కష్టాలు

- ఏజెన్సీ చేతిలో మోసపోయిన బయ్యారం మండల వాసి ప్రకాశ్
- అధైర్యపడొద్దంటూ మాజీ ఎంపీ కవిత భరోసా
- ఇండియా తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ



కాంబోడియాలో ఉన్న ప్రకాశ్‌తో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కవిత

బయ్యారం, జూన్ 17 : ఏజెన్సీ చేతిలో మోసపోయిన మహబూబాబాద్ జిల్లావాసి కాంబోడియా దేశంలో చిక్కుకొని సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎంపీ మాలోత్ కవిత అతడితో ఫోన్లో మాట్లాడి భారత్‌కు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని భరోసానిచ్చారు. వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లికి చెందిన మన్సఫ్ ప్రకాశ్ గత మార్చిలో ఓ ఏజెన్సీ ద్వారా ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేసేందుకు వెళ్లాడు. అయితే సదరు ఏజెన్సీ కాంబోడియాకు తీసుకెళ్లగా, అక్కడ సైబర్ నేరగాళ్ల బారిన పడి కొద్దిరోజులు చిత్రహింసలు అనుభవించాడు. ప్రస్తుతం ప్రకాశ్ ఇండియన్ ఎంబసీ ఆధీనంలో ఉన్నాడు. ప్రకాశ్ కుటుంబ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ కవిత సోమవారం అతడికి ఫోన్ చేసి పరిస్థితిపై ఆరా తీశారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇండియాకు తీసుకొచ్చేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అంతేగాక ప్రకాశ్‌కు సాయం చేయాలని కాంబోడియాలో ఉన్న తన మిత్రుడు కిరణ్‌రెడ్డిని కోరారు.

# విద్యుత్ సమస్యలు త్వరగా పరిష్కరించాలి

- *ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి*
- *తొలిరోజు ప్రజావాణిలో అర్జీల స్వీకరణ*

ఎల్కతుర్తి, జూన్ 17 : విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్కతుర్తి సబ్‌స్టేషన్ లో సోమవారం జరిగిన విద్యుత్ ప్రజావాణి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులు ప్రజావాణిని వినియోగించుకోవాలని కోరారు. ఎన్పీడీసీఎల్ 16 సర్కిళ్ల పరిధిలోని సర్కిల్, డివిజన్, ఈఆర్వో, సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉద్యోగులు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి పాటు పడాలని సూ చించారు. కార్యక్రమంలో హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వెంకటరమణ, డీఈ అనిల్‌కుమార్, ఏడీఈ పైడయ్య, ఏఈ లక్ష్మణ్ పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి



కరెంట్ పోవడంతో హనుమకొండలోని పెద్దమ్మగడ్డ ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన జనరేటర్

# పండుగ పూట కరెంట్ కష్టాలు

- *బక్రీద్ ప్రార్థనలు చేస్తుండగా పవర్ కట్*
- *జనరేటర్ సమకూర్చుకుని మత పెద్దల ప్రార్థనలు*

హనుమకొండ చౌరస్తా, జూన్ 17 : పండుగ పూట ముస్లింలకు కరెంట్ కష్టాలు తప్పలేదు. సోమవారం బక్రీద్ సందర్భంగా పిల్లలు, పెద్దలు అంతా కలిసి పండుగ జరుపుకొనేందుకు హనుమకొండలోని పెద్దమ్మగడ్డ ఈద్గా వద్దకు చేరుకున్నారు. ప్రార్థనలు చేస్తుండగా 9.10 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బంది పడ్డారు. కరెంట్ వస్తుందేమోనని ఎదురు చూసినా ఎంతకూ రాకపోవడంతో చేసేదేమీలేక జనరేటర్ సమకూర్చుకొని ప్రార్థనలు చేయాల్సి వచ్చింది. ఇలా కరెంట్ కట్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై, ప్రజాప్రతినిధులపై వారు మండిపడ్డారు. గతంలో ఇమామ్‌లకు కేసీఆర్ ప్రభుత్వం రూ.5 వేలు ఇస్తుండగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10వేలు ఇస్తానని గద్దెనెక్కి ఇప్పుడు మళ్లీ అవే వేస్తున్నారని, దావత్-ఏ-ఇఫ్తార్ ఇస్తానని, పేద ముస్లింలకు దుస్తుల పంపిణీకి ఎన్నికల కోడ్ ఉందని ఇప్పటివరకు పంపిణీ చేయలేదని బీఆర్ఎస్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ నయీముద్దీన్ మండిపడ్డారు. మౌలానా మొహమ్మద్ ఖాజా అహ్మద్ మావినుద్దీన్, కమిటీ సభ్యులు మహమ్మద్ నయీముద్దీన్, మహమ్మద్ సలీం, ఖలీల్ అహ్మద్, అజీం, మెయిన్, షకీల్, ఎండీ తోసీఫ్, మహమ్మద్ సక్లెన్, నవీద్, మహమూద్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల నిరసన బాట

- ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ల ప్రమోషన్లలో అన్యాయంపై రోడ్డెక్కిన ఉపాధ్యాయులు
- వివిధ సంఘాలకు ఎస్జీటీల రాజీనామా
- జనగామలో నల్లబ్యాడ్జీలతో ర్యాలీ

జనగామ, జూన్ 17 (నమస్తే తెలంగాణ) : పీఎస్ హెచ్‌ఎం పదోన్నతుల్లో బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు జరుగుతున్న అన్యాయంపై సోమవారం జనగామ జిల్లాలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. పీఆర్‌టీయూ సహా వివిధ సంఘాలకు మండల కమిటీల్లో బాధ్యులుగా ఉన్న నాయకులు, సభ్యులు తమ పదవులు, సంఘ ప్రాథమిక సభ్యత్వాలకు స్వచ్ఛందంగా రాజీనామా చేసి ఆందోళన బాట పట్టారు. తొలుత జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి టీచర్లు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని డీఈవో రాముకు మెమోరాండం ఇచ్చారు. బీఈడీ అర్హతతో ఎస్జీటీలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఒక్క ప్రమోషన్ కూడా లేకుండా తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పండిట్, పీఈటీల ఉన్నతీకరణ పోస్టుల్లో కూడా బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు అవకాశం ఇవ్వడం లేదని మండిపడ్డారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించి పరిష్కరించాల్సిన ఉపాధ్యాయ సంఘాలు పట్టించుకోవడం లేదంటూ పీఆర్‌టీయూ లింగాలఘనపురం, దేవరుప్పుల, కొడకండ్ల, జనగామ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూడి సత్యనారాయణ, అంబటి అంజయ్య, వాంకుడోత్ బీకోజీ, అనిల్, బొగ్గారపు శ్రీనివాస్, గోలి తిరుపతిరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పసునూరి సోమరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా విజయపాల్‌రెడ్డి సహా 29 మందితో పాటు వివిధ సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఎస్జీటీలు సభ్యత్వానికి రాజీనామా చేశారు. 2009 నుంచి ఇచ్చిన ప్రతి ప్రమోషన్ కౌన్సెలింగ్ ద్వారా బీఈడీ అర్హత గల ఎస్జీటీలకు ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించి ఇప్పుడు మాత్రం నిరాకరిస్తుండటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధనకు పనికొచ్చిన బీఈడీ అర్హతలు ఉన్న ఎస్జీటీలు అదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా ఎందుకు పనికిరారో ప్రభుత్వం చెప్పాలని నిలదీస్తున్నారు. ప్రధానోపాధ్యాయులుగా అదనపు బాధ్యతలు నిర్వర్తించిన బీఈడీ ఎస్‌జీటీలకు ఇప్పుడు అర్హత లేదనడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సహజ న్యాయ సూత్రాలను పాటించక పోవడం వల్ల బీఈడీ అర్హత ఉన్న తాము తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తంచేశారు. పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న దాదాపు 60వేల మంది ఎస్జీటీల సమస్య, మనోవేదన అని దీనిపై ప్రభుత్వం వెంటనే సమీక్ష చేసి గతంలో మాదిరిగా బీఈడీ అర్హతలు ఉన్న తమకు హెడ్మాస్టర్లుగా పదోన్నతులు కల్పించి, సమన్యాయం చేయాలని ఎస్జీటీలు కోరుతున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం పోస్టులను 10 వేలకు పెంచాలని డీఈవోకు ఇచ్చిన వినతిపత్రంలో ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు.

జనగామ కలెక్టరేట్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలు

